శుక్రవారం
02/జూన్/2023
సంపుటి : 03
సంచిక : 490
పేజీలు : 08

www.vijayamdaily.com

# విజయమ్

తెలుగు దినపత్రిక ⟷ అక్షర సమరానికి నాంది

2nd Aniversary Congratulations

Published From : Khammam | వెల : రూ.6/- | www.vijayam.in@gmail.com




## దేశంలో మారుతున్న రాజకీయాలు

**మోడీపై ప్రజలకు తొలగిన భ్రమలు**

**నిర్ణయాకశక్తిగా మారనున్న కెసిఆర్**

**దేశంపై స్పష్టమైన అవగాహన ఉన్న నేత కెసిఆర్**

**మంత్రి వేముల ప్రశాంతరెడ్డి వెల్లడి**

నిజామాబాద్, జూన్1(విజయం న్యూస్):

కేంద్రంలో ప్రత్యామ్నాయ ఫ్రంట్ ఏర్పాటుకు రోజురోజుకూ అవకాశాలు పెరుగుతన్నాయి.మోడీ వైఫల్యాలే లక్ష్యంగా వివిధ ప్రాంతీయపార్టీలు 2లో..

## నేడు తెలంగాణ ఆవిర్భావం..

**ప్రజలకు శుభాకాంక్షలు చెప్పిన కెసిఆర్**

హైదరాబాద్, జూన్1 (విజయం న్యూస్):

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సంసందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల హృదయాలు ఆనందం, గర్వంతో నింపుతున్న సందర్భమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలు గర్వించే క్షణమని, ఆవిర్భావ దినోత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్ర పోరాటంలో అన్ని వర్గాలవారు పాల్గొన్నారని, 2లో..





# మూడోసారి అధికారం మాదే..!

## కెసిఆర్ హ్యాట్రిక్ సిఎం కాబోతున్నారు

- బిజెపి, కాంగ్రెస్‌లు చేసిందేమీ లేదు
- తెలంగాణలో మాతో పోటీపడే విపక్షమే లేదు
- పివిని అవమానించన ఘనులు కాంగ్రెస్ నేతలు
- నీళ్లు,నిఆమకాలు, నిధుల ట్యాగ్ లైన్ మరువలేదు
- తెలంగాణను మించిన పాలన మరెక్కడా లేదు
- కొందరు ఎమ్మెల్యేల పనితీరు మెరుగు పడాల్సిందే
- మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి కెటిఆర్ వెల్లడి

హైదరాబాద్,జూన్1(విజయం న్యూస్):

తెలంగాణ రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి కూడా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. 90 నుంచి 100 స్థానాల్లో బీఆర్ఎస్ ఈజీగా గెలుస్తుంది. మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు అని కేటీఆర్ పేర్కొన్నారు. మంచి ప్రదర్శన, ప్రజల్లో పలుకుబడి ఉన్న ఎమ్మెల్యేలందరికీ సీట్లు దక్కుతాయన్నారు. కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లడంలోనూ, ప్రజల దృష్టిలో వెనుకబడిన ఎమ్మెల్యేలు తమ ప్రదర్శన మెరుగుపరుచుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ అవతరణను పురస్కరించుకుని తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్ చాట్ సందర్భంగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మాతో పోటీపడే స్థితిలో కాంగ్రెస్ పార్టీ లేదు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ భమల్లో ఉంది. రాష్ట్రంలో షర్మిల, కేఏ పాల్ అధికారంలోకి వస్తామని చెబుతున్నారు. వారిది కూడా భ్రమనే అని కేటీఆర్ పేర్కొన్నారు. వారు ఊసులోనే లేరని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతిపక్షాలపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్ర ప్రభుత్వంపై అనవసర ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలకు కేటీఆర్ సవాల్ విసిరారు. తెలంగాణ కన్నా ఉత్తమ పాలన ఏ రాష్ట్రంలో ఉందో చెప్పాలి. తెలంగాణ కన్నా మెరుగైన మోడల్ రాష్ట్రాన్ని చూపించాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. 75 ఏండ్లు పాలించిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు ఏం చేశాయి. మేం 9 ఏండ్లలో అభివృద్ధిలో అద్భుతాలు చేసి చూపించాం. బీజేపీ, కాంగ్రెస్ పరిపాలన కొత్త సీసాలో పాత సారా మాదిరి. కేంద్ర మంత్రులు టాయిలెట్స్, రైల్వేస్టేషన్లలో లిఫ్టులు ఓపెన్ చేస్తున్నారు.

➤ వివరాలు 02లో..



# మీరే నా బలం.. మీరే నా బలగం

**తెలంగాణ ఏర్పాటుతోనే అభివృద్ధి**

**త్వరలోనే పిల్లలకు న్యేట్రిషన్ కిట్**

**పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి హరీష్ శ్రీకారం**

సిద్దిపేట,జూన్1(విజయం న్యూస్):

మీరే నా బలం.. మీరే నా బలగం. మీ కోసం ఇంకా కష్టపడుతా.. మరింత సేవ చేస్తా. మీ ఆశీస్సులు, దీవెనలు, మీరిచ్చే బలం ఉన్నంత కాలం మీకు సేవ చేస్తూనే ఉంటానని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం మల్యాల గ్రామంలో మంత్రి హరీశ్‌రావు గురువారం పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు జడ్పీ చైర్మన్ రోజాశర్మతో కలిసి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. మల్యాల గ్రామానికి గ్రామస్తుల సహకారంతో రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చింది. ఎటు వైపు చూసినా గ్రామ రూపురేఖలు మారిపోయాయని, గల్లీ, గల్లీలో సీసీరోడ్లు వేసుకున్నామని తెలిపారు.

➤ వివరాలు 02లో..






# కాంగ్రెస్‌ది కొంగ జపం..బిజెపిది దొంగజపం

**ఆ రెండూ అభివృద్ధి నిరోధక పార్టీలు**

**ఓట్ల రాజకీయం కోసం పోటీ ఉత్సవాలు**

**మీడియతో మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శలు**

సూర్యాపేట,జూన్1(విజయం న్యూస్):

కాంగ్రెస్, బీజేపీలు ఓట్ల రాజకీయం కోసమే పోటీ ఉత్సవాలు చేస్తున్నాయని మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న పోటీ ఉత్సవాలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. గురువారం సూర్యాపేట జిల్లాలో జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కొంగ, దొంగ జపాలను తెలంగాణ ప్రజలు నమ్మరని వ్యాఖ్యానించారు. కేసీఆర్ తొమ్మిదేళ్ళ పాలనలో తెలంగాణ మోడల్ అభివృద్ధి దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ సాధించిన ప్రగతి దేశానికి **మీగతా** 2లో..




# మూడోసారి అధికారం మాదే

**మొదటి పేజీ తరువాయి..**

మేం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టులు కడుతున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఇతర రాష్ట్రాల్లో పోటీ చేసే దిశగా ఆలోచిస్తున్నామని, ఆంధ్రప్రదేశ్‌లోనూ మా పార్టీ కార్యక్రమాలు ప్రారంభించిందని కేటీఆర్ తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ సీఎం అభ్యర్థి ఎవరో చెప్పే దమ్ము ఉందా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఒక పార్టీ కాకుండా ఎన్జీవో, దుకాణాన్ని నడుపుకోవాలి. గుజరాత్‌లో ఎన్నికలు జరుగుతుంటే రాహుల్ పారిపోయాడు. పీవీ నరసింహారావును అవమానించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది అని కేటీఆర్ పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం గద్దె దిగాల్సిన అవసరం ఉంది. బీజేపీకి దమ్ముంటే దేశానికి చేసిన మంచి పనులు ఏంటో చెప్పాలి. నోట్ల రద్దుతో ఏం సాధించారో మోదీ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఇప్పుడు రూ. 2 వేల నోట్ల రద్దుతో సాధించింది ఏంటో కూడా చెప్పాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు.. లేని నిరుద్యోగం గురించి ఇక్కడ నిరసనలు చేస్తున్నారు. మేం విదేశీ పర్యటనలు చేసి వేలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాం. తాజా పర్యటనతో 42 వేల మందికి ఉద్యోగ అవకాశాలు తీసుకొచ్చాం అని కేటీఆర్ తెలిపారు. ఓఆర్ఆర్ టెండర్ ప్రక్రియ నేషనల్ హైవే టెండర్ మాదిరే జరిగింది అని కేటీఆర్ తెలిపారు. ప్రతిపక్షాల ఆరోపణలపై మున్సిపల్ శాఖ ఏ విచారణకైనా సిద్ధమని ప్రకటించింది. లీగల్ నోటీసులకు సమాధానం చెప్పాలి. చిల్లర మాటలు, ఆరోపణలు చేయడం ప్రతిపక్షాలు మానుకోవాలి అని కేటీఆర్ హెచ్చరించారు. మైనార్టీలకు తెలంగాణ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను పక్క రాష్ట్రాల్లో పొగిడిన ఓవైసీ ఇక్కడ ఎందుకు విమర్శలు చేస్తున్నారు అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్ని సీట్లలో పోటీ చేస్తారన్నది ఎంఐఎం పార్టీ ఇష్టం. ప్రజలు మత ప్రతిపాదికన ఓట్లు వేస్తారని నేను నమ్మను. మంచి ప్రభుత్వాన్ని మతాలకతీతంగా ఎన్నుకుంటారని నమ్ముతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ లేనే లేదు అని కేటీఆర్ తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలోనే బీజేపీ హంగామా అని ఆయన పేర్కొన్నారు. సౌత్ ఇండియా వర్సెస్ నార్త్ ఇండియా అనేది నా వాదన కాదు అని కేటీఆర్ స్పష్టం చేశారు. జనాభా నియంత్రణ చేపట్టిన రాష్ట్రాలు నష్టపోకూడదన్నదే నా వాదన. ప్రజాస్వామ్యంలో అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు ఉండాలి. యూపీ లాంటి రాష్ట్రంలో పెరిగే సీట్ల మొత్తం దక్షిణాది రాష్ట్రాల సీట్ల కన్న ఎక్కువ. దేశ ప్రగతికి మద్దతు ఇచ్చిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోకూడదు. అలాంటి పరిస్థితి వస్తే ఎవరూ సహించరు. లోక్‌సభ స్థానాల పెంపుపై ఆరోగ్యవంతమైన చర్చ జరగాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ గత 10 ఏండ్లుగా నీళ్లు, నిధులు, నియామకాలన్న స్ఫూర్తికి అనుగుణంగా పని చేస్తోందని కేటీఆర్ తెలిపారు. అందులో తెలంగాణ విజయం సాధించింది. సమగ్ర, సమతుల్య, సమ్మిళిత అభివృద్ధి సాధించింది. విద్య, వైద్య రంగంలో తెలంగాణలో అద్భుతమైన మార్పులు సాధించింది. మెడికల్ కాలేజీల ఏర్పాటుతో సమగ్రమైన మార్పు వచ్చింది. విద్యారంగంలో గుణాత్మకమైన మార్పు సాధించాం. తెలంగాణలో పరిపాలన సంస్కరణలు దేశంలో ఎక్కడా లేవు. అన్ని రంగాల్లో తెలంగాణ తనదైన మార్క్‌ను చాటింది. తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తోంది అని కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలోని ప్రతిపక్షాలకు పని లేకుండా పోయింది అని కేటీఆర్ ధ్వజమెత్తారు. 9 ఏండ్లుగా ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రతిపక్షాలు చేసే ఆరోపణల్లో హేతుబద్ధత లేదు. చేతిలో ఉన్న రూపాయిని పారేసి చిల్లర ఏరుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. చిల్లర రాజకీయాలు చేసే నాయకులను ప్రజలు పట్టించుకోరు. మన పాలనను ఇతర రాష్ట్రాల పాలనతో బేరీజు వేసుకోవాలి. ఒకప్పుడు పంటలు పండని చోట నేడు ధాన్యం ఎక్కువైన పరిస్థితి నెలకొంది. ధాన్యం కొంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ప్రత్యమ్నాయ రాజకీయాలకు దిక్సూచి కెసిఆర్

## విపక్షాలు కలసివుంటే ఇప్పటికే ఫ్రంట్ సాధ్యమయ్యేది
## విపక్షాల్లో అనైక్యతతోనే కెసిఆర్ ఒంటరి పోరాటం

**(హైదరాబాద్-విజయం న్యూస్):**

రాజకీయాల్లో కెసిఆర్ లాంటి నేత బహు అరుదు. పట్టుపడితే విడవకుండా పోరాడే తత్వం ఆయనకు పుట్టుకుతో వచ్చింది. అయన మాత్రమే మోఢీని ఎదుర్కొని నిలవగల సత్తా ఉన్న నేత అని చెప్పొచ్చు. మోడీతో ఉన్న ముప్పును ముందే గ్రహించి కెసిఆర్ ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదన తెచ్చారు. బీజేపీని దీటుగా ఎదుర్కొని మట్టికరిపిం చేందుకు ఉమ్మడిగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. అప్పట్లో కెసిఆర్ స్టాలిన్,నవీన్ పట్నాయక్, మమతా బెనర్జీ, శరద్ పవార్ తదితర నేతలను నేరుగా కలిసి ప్రత్యామ్నాయ రాజకీయాలపై చర్చకు తెరతీసారు. కానీ ఈ నేతల్లో ఎవరు కూడా మళ్లీ కెసిఆర్ ప్రతిపాదనలపై ప్రస్తావించలేదు. నిజానికి ఇప్పుడు దేశంలో ప్రజాస్వామ్యం పెద్ద ప్రమాదంలో పడింది. రాజ్యాంగంపైనా, సమాఖ్య వ్యవస్థపైనా నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా సమైక్యంగా, సమర్థంగా పోరాడాలి. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్ము తున్న మోడీ జిఎస్టీ పేరుతో సామాన్యుల నడ్డి విరిచారు. పెట్రో ధరలు విపరీతంగా పెంచారు. ఈ క్రమంలో అందరం కలిసి దేశ ప్రజలకు విశ్వసనీయ ప్రత్యామ్నాయాన్ని అందించాలన్నది కెసిఆర్ సంకల్పం. నిజానికి ఈ విషయంలో కెసిఆర్‌ను ముందు పెట్టి సాగితే ఓ బలమైన ప్రత్యామ్నాయం కాగలదు. దీనిని ఎవరూ పట్టించుకోక పోవడంలో బలమైన కారణం ఉంది. మనదేశంలో ప్రాంతీయ పార్టీలను నడుపుతున్న నేతలం దరికి ప్రధాని కావాలన్న కోరికత ప్ప దేశ రాజకీయాలను మార్చాలన్న సంకల్పం లేదు. ఎవరికి వారు తామే ప్రధాని పదవికి తగిన అభ్యర్థులమని భావిస్తున్నారు. అందుకే కెసిఆర్ ప్రతిపాదనలపై కలసి నడిచేందుకు ఎవరు కూడా ముందుకు రాలేదు. అందుకే కెసిఆర్ బిఆర్ఎస్‌తో ముందుకు నడవాలన్న ప్రయత్నం చేస్తున్నారు. ఎవరు కలసి వచ్చినా రాకున్నా ప్రజల్లో మార్పు వస్తే చాలన్న ధోరణిలో ముందుకు సాగుతున్నారు. గుణాత్మక రాజకీయాలు అంటున్న కెసిఆర్.. మాటలు చూశాక..మోడీ వైఫల్యాలపై కూడా చర్చించాలి. గత పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఈ ప్రతిపాదనలు తీసుకుని వచ్చిన కెసిఆర్ ఆనాటి ప్రాంతీయ పార్టీల నేతలు అందరినీ కలిసారు. ఇందులో మమతా బెనర్జీ కూడా ఉన్నారు. మమతా బెనర్జీని కెసిఆర్ ప్రత్యేకంగా కలసి ఉమ్మడి ఫ్రంట్ ఏర్పాటు చేద్దామని ప్రతిపాదించారు. కానీ దీనిని తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ పెద్దగా పట్టించుకోలేదు. ఔనని కానీ..కాదని కానీ చెప్పకుండా తృణీకరించారు. నిజానికి మూడేళ్ల క్రితమే మమతను కలిసినప్పుడు..ఆనాడే ఓ నిర్ణయానికి వచ్చి వుంటే ఇవాళ కెసిఆర్ నేతృత్వంలో ఓ ఫ్రంట్ బలపడేది. దేశంలో సమైక్య ప్రతిపక్షం ఏర్పర్చేం దుకు 2019 లోక్ సభ ఎన్నికల ముందునుంచీ ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ వివిధ పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం వల్ల అది ఇంతవరకూ సాధ్యం కాలేదు. తరవాత కార్యక్షేత్రంలోకి దిగిన కెసిఆర్ ప్రయత్నాలను ఎవరూ పెద్దగా స్వాగతించలేదు. దీంతో ఆయన కూడా వెనక్కి తగ్గారు. కాని ప్రస్తుతం దేశంలో విశ్వసనీయ ప్రత్యామ్నాయం ఏర్పడేందుకు సమయం ఆసన్నమయ్యింది. గవర్నర్ల అధికారాలను దుర్వినియోగ పరచడం, సీబీఐ, ఈడీ, ఐటీ వంటి కేంద్ర సంస్థలను తమకు అనుకూలంగా వాడుకోవడం, రాష్ట్రాల నిధుల్ని తొక్కిపెట్టడం, జాతీయ అభివృద్ధి మండలి, ప్రణాళికా సంఘం వంటి సంస్థల్ని రద్దు చేయడం, బీజేపీయేతర ప్రభుత్వాల్ని పడగొట్టేందుకు వెనకాడకపోవడం,జాతీయ ఆస్తులను విశృంఖలంగా ప్రైవేటు పరం చేయడం, కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలు క్షీణించడం మొదలైన వాటిని చూస్తూనే ఉన్నాం. అవకాశం వస్తే సిఎం కెసిఆర్ జాతీయ రాజకీయాల్లో నిర్ణాయక శక్తిగా మారగలరు. మోడీకన్నా మెరుగైన పాలన అందించగలరు.

# సిద్దిపేటకు రైలు కూతపెట్టాలి

### నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి
### పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి

**సిద్దిపేట,జూన్1(విజయం న్యూస్):**

సిద్ధిపేట శివారు మందపల్లి నుంచి రైల్వే ట్రాక్ లైను పనులు రాష్ట్ర ఆర్థిక, వైద్యఆరోగ్య మంత్రి హరీష్‌రావు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సిద్ధిపేటకు తొందరలోనే రైలు కూత వచ్చేలా యుద్ధప్రాతిపదికన రైల్వే ట్రాక్ పనులు పూర్తి చేయాలని రైల్వే శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. సిద్ధిపేట రైల్వే ట్రాక్ నిర్మాణ పనుల్లో జాప్యం జరగొద్దని, పనుల వేగం పెంచాలని రైల్వే శాఖ అధికార యంత్రాంగం, కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, రైల్వే శాఖ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ సంతోష్ కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమరాజు, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ జనార్ధన్ బాబు, సిద్ధిపేట ఆర్డీఓ రమేశ్ బాబు, ఇతర అధికార యంత్రాంగంతో కలిసి క్షేత్రస్థాయి రైల్వే ట్రాక్ పనులను మంత్రి పరిశీలించారు. దు÷-దదెడ - సిద్ధిపేట వరకూ రైల్వే ట్రాక్ నిర్మాణ పనులలో భాగంగా చేపట్టిన ట్రాక్ నిర్మాణ పనుల గురించి మంత్రికి రైల్వే శాఖ అధికారులు వివరించారు. దుద్దెడ - సిద్ధిపేట రైల్వే ట్రాక్ పనులలో భాగంగా మందపల్లి వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ జాప్యంపై ఆరా తీసి, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని రైల్వే శాఖ అధికారులను మంత్రి హరీష్‌రావు ఆదేశించారు.




# నేడు తెలంగాణ ఆవిర్భావం

**మొదటి పేజీ తరువాయి..**

తెలంగాణ కోసం అనేకమంది త్యాగాలు చేశారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమ అమరవీరుల వారికి, వారి అంకితభావానికి హృదయపూర్వకంగా నివాళి అర్పిస్తున్నానన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో సమాజంలో అన్నివర్గాల ప్రజలు పాల్గొన్నారని గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో ఎన్నో ముఖ్యమైన సంఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. విద్యార్థులు, యువకులు ఎన్నో త్యాగాలు చేశారన్న ఆయన.. ప్రజలు, పాలకుల కృషితో ఆకాంక్షలు నెరవేరడంతో పాటు తెలంగాణ ప్రత్యేక వనరులు, అవకాశాల్లో న్యాయమైన వాటా పొందుతారని పూర్తి నమ్మకం ఉందన్నారు. ఐటీ, ఫార్మా, లైఫ్‌సైన్సెస్, వ్యవసాయంలో ప్రసిద్ధి చెందిన తెలంగాణ రాష్ట్రం సమ్మిళిత అభివృద్ధి దిశగా పురోగమిస్తూనే ఉంటుందని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ అలుపెరగని చైతన్యం రోజురోజుకు మరింత బలపడాలని సీఎం ఆకాంక్షించారు.

# మీరే నా బలం..మీరే నా బలగం

**మొదటి పేజీ తరువాయి..**

మరో వారం రోజుల్లో గర్భిణీలకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ అందిస్తామని హరీశ్‌రావు తెలిపారు. పుట్టబోయే బిడ్డకు న్యూట్రిషన్ కిట్. పుట్టిన బిడ్డకు ఇచ్చేది కేసీఆర్ కిట్. ఇది కేసీఆర్‌కు ప్రజల మీద ఉన్న ప్రేమగా మంత్రి చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి సీఎం కేసీఆర్ అయ్యాక అవ్వ, తాతల గౌరవం పెరిగింది అని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ రాకపోతే ఇంత అభివృద్ధి జరిగేదా అంటూ.. గత గ్రామ అనుభవాలు గుర్తు చేసి, ఇవాళ జరిగిన గ్రామ అభివృద్ధిని వివరించారు. కాళేశ్వరం నీళ్లతో మండుటెండలలో చెరువులు నిండు కుండలుగా తలపిస్తున్నాయని వివరించారు. ఎవ్వరైనా సరే సద్దితిన్న రేవు తలవాలని కోరారు. రూ.200 పింఛన్ రూ.2 వేలు చేశామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బోర్లు వేసినా నీళ్లు పడక బాధపడ్డారని, తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ హయాంలో ఆ బాధ తప్పిందని, ప్రజలకు ఏం కావాలో ఆలోచన చేసి ఇచ్చే సంక్షేమ ప్రభుత్వం మనదని మంత్రి హరీశ్ వెల్లడించారు. గతంలో బోరు బావులు తవ్వి డబ్బులు వృథా చేసుకున్నారని, ఇవాళ కాళేశ్వరం నీటితో రెండు పంటలు పండించుకుంటున్నామని నాటి-నేటి పరిస్థితిని హరీశ్‌రావు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎరువుల కొరత ఉండేదని, కానీ ఇవాళ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక రైతుల కోసం 24 గంటల నిరంతర విద్యుత్, ఎరువులు తదితర రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం తలపెట్టిన అంశాలు వివరించారు. రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారికి అండగా ఉంటామని మంత్రి హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. మొదటి విడతలో 40-50 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామ లైబ్రరీకి వారంలో ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తానని హామీనిచ్చారు. గ్రామంలో 808 రైతులకు రైతుబంధు, అనివార్య కారణాలతో మృతి చెందిన 14 మంది రైతు కుటుంబాలకు రైతుభీమా ఇచ్చి ఆదుకున్నామని తెలిపారు. గ్రామంలో ఇటీవల శిక్షణ పొందిన 21 మందికి కుట్టు మిషన్లు త్వరలోనే అందిస్తామని మంత్రి హామీనిచ్చారు. అంతకుముందు 30 రోజుల ప్రణాళికతో మంత్రి సహకారంతో మల్యాల గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నామని గ్రామ ప్రజాప్రతినిధులు వివరించారు. గ్రామంలో 18 రకాల అభివృద్ధి పనులు చేసుకోవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# దేశంలో మారుతున్న రాజకీయాలు

**మొదటి పేజీ తరువాయి..**

ఏకం అవుతున్నాయి. మోడీ నిర్ణయాలను ఇప్పుడు ఎవరు కూడా ప్రశ్నించే స్థితిలో లేరని గుర్తించే కెసిఆర్ గళమెత్తారు. ధరల పెరుగుదల, పెట్రో ధరల దాడి, జిఎస్టీ వాతల గురించి బిజెపి నేతలు కూడా చర్చించడంలేదు. ఈ క్రమంలో బిజెపికి వ్యతిరేకంగగా ప్రత్యామ్నాయం కేవలం కెసిఆర్‌తో సాధ్యమని మంత్రి వేముల ప్రశాంతరెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని ముందే గుర్తించి కేంద్రంలో మోడీకి ప్రత్యామ్నాయం కావాలని కోరుకున్న మొదటి నాయకుడు సిఎం కెసిఆర్ అని గుర్తు చేశారు. ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదన తీసుకుని వచ్చిన మొదటి నేత కూడా కెసిఆర్ అన్నారు. నిజానికి ఆనాడు కెసిఆర్ ప్రతిపాదనపై ఓ అడుగు ముందుకు వేసివుంటే ఇవాళ ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. గతకొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచార సరళి, జాతీయ రాజకీయాల్లో వస్తున్న మార్పులు చూస్తుంటే సిఎంకెసిఆర్ ప్రధాని అయినా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదన్నారు. గురువారం నాడాయన ఆర్ఎన్ఎ ప్రతినిధితో మాట్లాడుతూ ..ఈ విషయంలో కెసిఆర్ ఆలోచన చేస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ జాతీయ రాజకీయాల్లో బాణంలా దూసుకుపోవడం ఖాయమని అన్నారు. సంకీర్ణ రాజకీయాల్లో ఏదైనా సాధ్యం అన్నారు. కర్నాటక ఎన్నికల ఫలితాల తరవాత దేశంలోని ఇతరపార్టీలు కూడా మరింత వేగంగా నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని అన్నారు. అయితే ప్రత్యామ్నాయ రాజకీయాలు కేవలం కెసిఆర్‌కు మాత్రమే సాధ్యమని వేముల అన్నారు. ఢిల్లీలో నిర్ణాయక శక్తిగా అవతరించడానికి కెసిఆర్‌కు మాత్రమే అవకాశం ఉందన్నారు. కెసిఆర్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. తెలంగాణ తరహా అభివృద్ధి చేయాలంటే బిఆర్ఎస్ అధిక మెజారిటీతో గెలిపించినప్పుడే కేసీఆర్‌ను ప్రధాని చేయగలమని అన్నారు. జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్, బిజెపిల కాలం చెల్లిందని అన్నారు. జాతీయ రాజకీయాల్లో ఇప్పుడు మోడీపై నమ్మకం పోయిందని, అలాగే కాంగ్రెస్‌ను మరోమారు ప్రజలు నమ్మే స్థితి లేదన్నారు. వివిధ పార్టీల్లో సత్తా కలిగిన నేత ఎవర్న చర్చ వచ్చినప్పుడు అంతా తెలంగాణ వైపు చూస్తున్నారని అన్నారు. దీనికి కారణం కెసిఆర్ అమలు చేస్తున్న కార్యక్రమాలకు తోడు, తెలంగాణ సాధించిన విప్లవ నేతగా గుర్తింపు ఉందన్నారు. తాము వివిధ పార్టీల నాయకులతో మాట్లాడినప్పుడు ఇదే భావన వ్యక్తం అవుతోందన్నారు. దేశం పట్ల స్పష్టమైన అవగాహన కెసిఆర్‌కు ఉందన్నారు. 75 సంవత్సరాలు దేశాన్ని పాలించిన నాయకులు దేశ అభివృద్ధిని పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ తొమ్మిదేళ్లలో రైతుల పక్షాన నిలబడి నిరుపేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. పేదల కుటుంబాలకు అండగా నిలుస్తున్న మహోన్నతమైన వ్యక్తి కేసీఆర్ ప్రధానిగా ఉంటే రైతు రాజ్యంగా తయారు చేస్తారని అన్నారు. దేశవ్యాప్తంగా ఇకముందు జరుగునున్న ఎన్నికలు రాష్ట్రాలకు చెందినవి కాదని, ఇది దేశాభివృద్ధి కొరకు జరిగే ఎన్నికలు కావాలన్నారు. కెసిఆర్ జాతీయనేతగా ఎదిగితే సమస్యలను పరిష్కరిస్తూ దేశ ప్రగతిని మరింత పెంచవచ్చన్నారు. ప్రస్తుతం దేశ ప్రజలకు చౌకీదార్, టేకేదార్ అవసరం లేదని ప్రజలకు మెరుగైన పాలన అందించే నాయకులు, ధృడ సంకల్పంతో ఉన్న సైనికుడు కావాలన్నారు. దేశ ప్రధాని మోదీకి ప్రజల సమస్యలపై ఎటువంటి అవగాహన లేదని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ ప్రజల సొమ్ముతో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ వేలాది కోట్ల రూపాయాలు దోచుకున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్‌కు దేశాన్ని పాలించే సత్తా ఉంది. ఇప్పటికే తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలు.. వాటి ఫలితాలపై అంతర్జాతీయ స్థాయిలో చర్చించుకుంటున్నాయి. తెలంగాణ వనరులు, అవసరాలపై పూర్తి పట్టున్న ఉద్యమ నేత సీఎం కావడం, అనతి కాలంలోనే రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలపడం మామూలు విషయం కాదు. ఇలానే దేశావసరాలు, నదుల అనుంధానం, రైతులు, వ్యవసాయ రంగంపై స్పష్టమైన అవగాహన ఉంది. అలాంటి కేసీఆర్ ప్రధానమంత్రి అయితే దేశ ప్రజలు అన్ని విధాలా లబ్ధిపొందుతారని అన్నారు. దేశ ప్రజల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జాతీయ ప్రత్యామ్నాయ ఆవశ్యకతను గతంలోనే ప్రస్తావించారని అన్నారు. అదే సమయంలో దేశంలోని అనేక ప్రాంతీయ పార్టీల నేతలు కేసీఆర్ ముందుచూపును స్వాగతించి ఉంటే ఇప్పటికే ఓ రాజకీయాల్లో ఓ మలుపు తిరిగేవని అన్నారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయరంగంతో అనుసంధానించాలని సీఎం కేసీఆర్ అనేకసార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తేవడం దానిపై గట్టిగా పోరాడడం వంటి జాతీయసమస్యలపై రాజకీయ పార్టీలు కెసిఆర్ వైఖరిని సమర్థిస్తున్నారని అన్నారు.

# సోనియమ్మతోనే ప్రత్యేక తెలంగాణ సాకారం

- అమరుల ఆకాంక్షకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పాలన
- భూ కబ్జాలు, రియల్టర్లకు ప్రభుత్వ పదవులు
- బీఆర్ఎస్ దుర్మార్గానికి 9 ఏండ్లు
- పీసీసీ సభ్యులు,నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్
- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు
- సోనియమ్మ చిత్ర పటానికి పాలభిషేకాలు చేయాలి



(ఖమ్మం ప్రతినిధి-విజయమ్ న్యూస్)

ఆల్ ఇండియా కాంగ్రెస్ అధినేత్రి, తెలంగాణ తల్లి సోనియమ్మతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిందని పీ సీ సీ సభ్యులు నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ అన్నారు.హత్ సే హత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం రఘునాధపాలెం మండలంలో పరికలబోడు తండా,లచ్చిరం తండా, ఎన్ వి బంజరలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్ల నాటి కల కాంగ్రెస్ పార్టీ తోనే అదీ అమ్మ సోనియమ్మతోనే సాధ్య పడిందని అన్నారు. అమరవీరుల కుటుంబాలను, అమరవీరులను అవమానపరిచి కేసీఆర్ భూ కబ్జాదారులకు, రియల్టర్లు ప్రభుత్వ పదవులు కట్టబెట్టారని ఎద్దేవా చేసారు. అమరవీరుల ఆత్మ బలిదానాలను గౌరవించిన అమ్మ సోనియమ్మ ప్రత్యేక తెలంగాణ తో తెలంగాణ ప్రాంతానికి న్యాయం జరుగుతుందని భావించి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి మనుగడ ఉండదని తెలిసినప్పటికీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత సోనియమ్మది అని అన్నారు. నేడు కేసీఆర్ ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కి తన బినామీలకు తన కుటుంబానికి పదవులు కట్టబెట్టి తెలంగాణ ప్రాంత వాసులను దోపిడీ చేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిదులను కొనుగోలు చేసి ప్రజాస్వామ్యన్ని ఖూనీ చేసే నీచ సంస్కృతి కి తెర లేపరని విమర్శించారు. నేడు రాష్ట్రంలో కేంద్రంలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే బ్రిటిష్ మరియు నిజం దొరల పాలన గుర్తు వస్తుందని అన్నారు. ఈ రెండు ప్రభుత్వాలను తరిమి కొట్టాలంటే కాంగ్రెస్ కు బలం చేకూర్చాలని అన్నారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక ఎన్నికల గెలుపుతో మోడీ బ్రిటిష్ ప్రభుత్వానికి భయం పట్టుకుందని త్వరలోనే దేశం విడిచి పోవడం ఖాయం అని అన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలో బీఆర్ఎస్ కు ఎన్నికల భయం పట్టుకుందని ప్రజలు వాస్తవాలను గ్రహిస్తున్నరని అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సోనియమ్మ చిత్ర పటానికి పాలభిషేకాలు చేసి అమ్మకు కృతజ్ఞతలు తెలపాలని పిలుపునిచ్చారు.రఘునాథ పాలెం మండల అధ్యక్షుడు భూక్యా బాలాజీ, మారం కరుణాకర్ రెడ్డి, కొంటేముక్కుల నాగేశ్వరరావు, ఏలూరి రవికుమార్, నరేష్,వసీం, యశ్వంత్, నాని, పరికలబోడు తండా గ్రామ కాంగ్రెస్ నాయకులు మూరలీ, బాన్సి లాల్, నరేష్, హనుమ, భాష, మదన్ లాల్, చందర్, నరేష్, మోతీలాల్, వెంకట్రామ్, హేమ్మల తది తరులు పాల్గొన్నారు.



## అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాల పట్టాలను పంపిణి చేయాలి

### అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టర్

(ఖమ్మంప్రతినిధి-విజయమ్ న్యూస్)

జిల్లాలో భూసేకరణ చేసి ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి అర్హుల్కైన నిరుపేదలకు (75) గజాల నివాసయోగ్యమైన ఇండ్లస్థలాల పట్టాల పంపిణీకి చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి స్ఫూర్తి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి తహాశీల్దార్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హుల్కైన వారి జాబితాను రూపొందించి లబ్ధిదారులకు పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జాబితా రూపొందించే క్రమంలో పారదర్శకత పాటించాలని, తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్, 9వ తేదీన అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో పట్టాల పంపిణీ సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, భూసేకరణ విభాగం పర్యవేక్షకులు రంజిత్‌కుమార్, కలూరు రెవెన్యూ డివిజలనల్ అదికారి సూర్యనారాయణ, ఆయా మండలాల నుండి తహశీల్దార్లు పాల్గొన్నారు.

# దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

## వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టర్



(ఖమ్మంప్రతినిధి-విజయమ్ న్యూస్)

21 రోజుల పాటు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళికతో కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. గురువారం ఐడిఓసి లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మండల స్పెషల్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడివోలు, మండల వ్యవసాయ అధికారులతో జిల్లా కలెక్టర్ వేడుకల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 21 రోజులపాటు జరిగే వేడుకలను అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. జూన్ 3 న చేపట్టే తెలంగాణ రైతు దినోత్సవానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. రైతు వేదికలో చేపట్టే ఈ కార్యక్రమానికి, ఆయా క్లస్టర్ పరిధిలో వచ్చే గ్రామాల నుండి రైతులను సమీకరించాలన్నారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా రైతులు రైతు వేదికకు ఊరేగింపుగా చేరుకోవాలన్నారు. రైతు వేదికలను ఒకరోజు ముందస్తుగానే విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. సమావేశం ఏర్పాటుచేసి, రైతుబంధు, రైతు భీమా తదితర సంక్షేమ పథకాలపై వివరించాలని, రైతు భీమా లబ్ది పొందిన కుటుంబంతో వారు పొందిన సాయం గురించి వారితోనే పంచుకోవాలని అన్నారు. ముందస్తు సాగు, పంట మార్పిడిల పై అవగాహన కల్పించి, ప్రయోజనాలను వివరించాలన్నారు. రైతువేదికలో ప్రభుత్వం రైతులకు అందించిన సంక్షేమ పథకాలపై స్క్రీన్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శించాలన్నారు. రోజువారి కార్యక్రమాలను ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తీయించాలన్నారు. వేసవి దృష్ట్యా షామియానాలు, త్రాగునీరు, భోజనాలు సౌకర్యవంతంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం పంట సాగు పద్ధతులపై వ్యవసాయ శాఖచే రూపొందించిన గోడపత్రిక, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు స్నేహాలత మొగలి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాదికారి వి.వి.అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల, ఏ.డి.ఏ సరిత, తదితరులు పాల్గొన్నారు.

## దేశానికే తెలంగాణ ఆదర్శం:- మంత్రి పువ్వాడ

### సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో సువర్ణ పరిపాలన

### తెలంగాణ రాష్ట్ర 10వ అవతరణ దినోత్సవం సందర్భంగా మంత్రి పువ్వాడ శుభాకాంక్షలు



(ఖమ్మంప్రతినిధి-విజయమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది అవతరణ దినోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అనేక పోరాటాలు, త్యాగాలు,బలిదానాలతో పార్లమెంటరీ ప్రజాస్వామిక పద్ధతిలో పోరాడి సాధించుకున్న తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నాం అని అన్నారు.తొమ్మిదేళ్ల అనతి కాలంలోనే ధృఢమైన పునాదులతో సుస్థిరతను చేకూర్చుకున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం నాటి ఉద్యమ నినాదాలను వొక్కొక్కటిగా అమలు చేస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీరు, తాగునీరు, విద్యుత్తు, విద్య, వైద్యం, రోడ్లు, తదితర మౌలిక వసతులను, స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలతో కల్పన చేసుకుంటూ వస్తున్నామన్నారు. భారత దేశంలో 29వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశానికి, సహచర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే స్థాయిలో నిలబెట్టుకున్నందుకు గర్వంగా ఉందన్నారు.సమైక్య రాష్ట్రంలో విస్మరించబడిన రంగాలను, వొక్కొక్కటిగా ఓపికతో, దార్శనికతతో అవాంతరాలను లెక్కజేయకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ చక్కదిద్దుకుంటూ వస్తున్నారని అన్నారు. తెలంగాణ సమాజం తొంభైశాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో నిండివున్న నేపథ్యంలో వారి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నదని పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో మరింత ప్రగతిని సాధిస్తాం అని మంత్రి పువ్వాడ అజయ్ తెలిపారు.

# టీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు తీపికబురు..

- రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కానుకగా మరో డీఏ.
- జూన్ నెల వేతనంతో కలిపి చెల్లింపు.
- సిఎం కేసీఆర్ సూచనల మేరకు డిఏ ను ఆమోదించిన మంత్రి పువ్వాడ.
- టీఎస్ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ వీసీ సజ్జనర్ వెల్లడి.



(ఖమ్మం ప్రతినిధి-విజయమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) ఉద్యోగులకు సంస్థ తీపికబురు చెప్పింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కానుకగా మరో విడత కరువు భత్యం(డీఏ) ఇవ్వాలని నిర్ణయించినట్లు టీఎస్ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ వెల్లడించారు. జులై 2022 లో ఇవ్వాల్సి ఉన్న 4.9 శాతం డీఏను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జూన్ నెల వేతనంతో కలిపి డీఏను ఉద్యోగులకు సంస్థ చెల్లిస్తుందని ప్రకటించారు. ఉద్యోగులకు డిఏ అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఅర్ గారి దృష్టికి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఇటీవలే తీసుకెళ్లగా ముఖ్యమంత్రి కేసీఅర్ సానుకూలంగా స్పందించారు. వారి సూచనల మేరకు ఆయా నిర్ణయాన్ని నేడు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆమోదించారు. ఉద్యోగులకు అందాల్సిన"తెలంగాణ ఉద్యమంలో టీఎస్ఆర్టీసీ ఉద్యోగులు క్రియాశీల పాత్ర పోషించారని, 2011లో దాదాపు 29 రోజుల పాటు సకల జనుల సమ్మెలో పాల్గొని ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కానుకగా పెండింగ్ లో ఉన్న ఏడో డీఏను ఉద్యోగులకు మంజూరు చేయాలని టీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇప్పటివరకు ఏడు డీఏలను సంస్థ మంజూరు చేసింది. మిగిలిన ఒక్క డీఏను త్వరలోనే ఉద్యోగులకు ప్రకటిస్తుంది." అని టీఎస్ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, సంస్థ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ తెలిపారు.



## మావోయిస్టుల కుట్ర భగ్నం..

**ములుగు/నూగూరు వెంకటాపురం/జూన్1(విజయమ్ న్యూస్):**

మావోయిస్టులు పన్నిన కుట్రను పోలీసులు భగ్నం చేసినట్లు వెంకటాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ కాగితోజు శివ ప్రసాద్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో శివప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి కొరియర్లుగా ఉంటూ ప్రభుత్వ అభివృద్ధి పనులకు అడ్డుపడుతూ, రహదారి నిర్మాణానికి ఉపయోగించే యంత్రాలను ధ్వంసం చేయాలనే నెపంతో వాజేడు మండలం, గుమ్మడిదొడ్డి గ్రామ శివారులోని వంతెన వద్ద బుధవారం రాత్రి సమావేశమైన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో బుధవారం రాత్రి సిఐ శివప్రసాద్, వాజేడు ఎస్సై రేక అశోక్, సిఆర్పిఎఫ్ బలగాల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా గమనించిన ముగ్గురు పారిపోయేందుకు ప్రయత్నించగా, వారిని వెంటాడి పట్టుకున్నా మన్నారు. వారి వద్ద ఉన్న ద్విచక్ర వాహనంపై ఒక బస్తా సంచిలో పేలుడు పదార్థాలు, పెట్రోలుతో ఉన్న పుల్లూరి నాగరాజు,వావిలాల నర్సింగరావు, ఏంపల్లి జాషువ ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారిని ఇద్దరు పంచుల సమక్షంలో విచారించగా వెంకటాపురం, వాజేడు మండలాల మావోయిస్టు కార్యదర్శి సుధాకర్ ఆదేశాల మేరకు సహకరించిన గుమ్మడిదొడ్డి బంక్ యజమాని కంబల్లపల్లి గణపతి కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బంకు యజమాని వద్ద పది లీటర్ల పెట్రోలు,5000 రూపాయల తీసుకొని రోడ్డు పనులు జరుగుతున్న వాహనాలను తగలబెట్టడానికి వెళుతున్నట్లు నేరాన్ని ఒప్పుకున్నారని తెలిపారు. నిందితులతో పాటు మావోయిస్టులకు సహకరించిన బంకు యజమానిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తునట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ వారి స్వార్థ ప్రయోజ నాల కోసం మాత్రమే పాటుపడుతుందని ప్రజలు మావోయిస్టు పార్టీకి సహకరించవద్దని వారితో కలిసి నేరాలకు పాల్పడి ఏజెన్సీ యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సీఐ శివప్రసాద్ తెలిపారు.



## ప్రజా ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం

**ఏన్కూరు. జూన్ 1 (విజయమ్ న్యూస్)**

ప్రజా ఉద్యమాల ద్వారానే మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పడిగ ఎర్రయ్యఅన్నారు. యు.సి.సి.అర్.ఐ (యం-యల్) పార్టీ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో గురువారం లచ్చగూడెం లో భారత విప్లవోద్యమ నిర్మాత దేవులపల్లి వెంకటేశ్వరరావు "జయంతి సభ" వాగబోయిన వెంకటనర్సయ్య అధ్యక్షతన జరిగినది. ఈ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. దేవులపల్లి వెంకటేశ్వరావు చూపిన మార్గంలో ఉద్యమించాలని కోరారు. సమాజ నిర్మాణానికి బాటలు వేసిన మహోన్నతమైన వ్యక్తి డి వి అని కొనియాడారు.. ఈ సభలో ఓ.పి.డి.అర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండా లింగయ్య, యు.సి.సి.అర్.ఐ (యం - యల్) పార్టీ జిల్లా నాయకులు పోలెబోయిన ముత్తయ్య, గ్రామీణ పేదల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్తి రామచంద్రయ్య,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సొంద్ మియా, జిల్లా ప్రధాన కార్యదర్శి బాణాల లక్ష్మణాచారి,ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్తి లెనిన్ తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా గ్రామ దేవతల విగ్రహా ప్రతిష్ట మహోత్సవం

### భారీగా తరలివచ్చిన భక్తులు

**ఏన్కూరు జూన్ 1(విజయమ్ న్యూస్)**

మండల పరిధిలోని పెద్దిన్ని కిష్టయ్య బంజర గ్రామంలో గురువారం అభయాంజనేయ స్వామి, నాభి శిల, ముత్యాలమ్మ తల్లి, పోతురాజు విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగాయి. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణాల మధ్య విగ్రహ ప్రతిష్టలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్ లాల్ హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు బాదావత్ బాలాజీ, సర్పంచ్ హరి సింగ్,వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.




## సత్తా చాటిన టిఎల్ పేట విద్యార్థులు

### గురుకుల సీట్లు సాధించడంలో రికార్డు

**ఏన్కూరు. జూన్ 1(విజయమ్ న్యూస్)**

ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం తూతక్క లింగన్నపేట గ్రామానికి చెందిన విద్యార్థులు ఐదవ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షల్లో ఎక్కువ సీట్లు సాధిస్తూ,తమ సత్తా చాటుతున్నారు. రికార్డు సృష్టిస్తున్నారు. 25 సంవత్సరాల నుండి వివిధ గురుకుల విద్యాలయాల్లో వందలాదిమంది సీట్లు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సీట్లు సాధించి గురుకుల విద్యాలయాల్లో విద్యను అభ్యసించి, ఉన్నత స్థాయికి వెళ్లి, వివిధ రంగాల్లో ఉద్యోగాలు సాధించి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఎక్కడ పరీక్ష పెట్టిన, ఎప్పుడు పరీక్ష పెట్టిన,ఆత్మవిశ్వాసం, పట్టుదల, ధైర్యంతో పరీక్ష రాసి అందరికంటే ముందంజలో సీట్లు సాధిస్తూ, తమ సత్తాను ప్రతిభను చాటుతున్నారు టిఎల్ పేట విద్యార్థులు.ప్రతి ఏడాది సీట్లు సాధిస్తున్న, ఈ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న జుజ్జూరి కృష్ణమాచారిని, ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు. హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలుపెరగకుండా గురుకుల ప్రవేశాలకు శిక్షణ ఇస్తూ వందలాది మంది విద్యార్థులకు సీట్లు వచ్చే విధంగా కృషి చేస్తున్న ఆ గ్రామానికి చెందిన జె.కృష్ణమాచారిని అభినందించారు. అభినందిస్తున్నారు. జిల్లాలోనే ఈ గ్రామానికి విద్యాభివృద్ధిలో పేరు తెచ్చారు.



## ఓటరు నమోదు పక్రియ చేపట్టాలి

**ములుగు/నూగురు వెంకటాపురం/జూన్ 1(విజయమ్ న్యూస్):**

మండలంలోని ప్రతి గ్రామంలో ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టాలని తహశీల్దార్ అంటి నాగరాజు అన్నారు. బూత్ స్థాయి అధికారులతో రెవిన్యూ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. జాతీయ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిలో సర్వే చేయాలని అధికారులకు సూచించారు. జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులందరిని ఓటర్లుగా గుర్తించి జాబితాలో నమోదు చేయాలన్నారు. చనిపోయిన వారిని, గ్రామాలకు శాశ్వతంగా దూరమైన వారిని గుర్తించి ఓటరు జాబితా నుండి తొలగించాలన్నారు. ఓటరు చిరునామా సవరణలు, వికలాంగుల మార్కింగ్ వంటి ప్రక్రియలను జూన్ 23లోగా ముగించాలని సమావేశంలో అధికారులకు సూచించారు. డిప్యూటీ తహసిల్దార్ రాజశేఖర్, గిర్ధవార్ మల్లయ్య, తదితరులు ఉన్నారు.

# సేవకు ప్రతి రూపం నామ

- పేదల ఆత్మ బంధువు ఎంపీ నామ
- అభివృద్ధి ప్రదాత నామ
- తెలంగాణా జాతిపిత కేసీఆర్ కు అండగా ఉండాలి
- దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి
- కేసీఆర్ ను మూడోసారి సీఎంగా చేసుకోవాలి
- ఎంపీ నామ నాగేశ్వరరావు చొరవతో వైరా నియోజక వర్గ లబ్ధిదారులకు మంజూరైన రూ.7,88,500 విలువైన సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, రైతు బంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు



**ఖమ్మం / వైరా, జూన్ 01(విజయమ్ న్యూస్):**

బడుగు, బలహీన వర్గాల పెన్నిధి, ఆత్మ బంధువు, అభివృద్ధి ప్రదాత ఎంపీ నామ నాగేశ్వరరావు అని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్, రైతు బంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వ రరావు పేర్కొన్నారు. గురువారం వైరా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో వైరా, కొణిజర్ల, సింగరేణి, జూలూరూపాడు, ఏన్కూరు మండలాలకు చెందిన 24 మంది లబ్ధి దారులకు మంజూరైన రూ.7,88,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్య క్రమంలో ఎమ్మెల్యే రాములు నాయక్, నల్లమల మాట్లాడుతూ ఎంపీ నామకు పేదలంటే ఎంతో ప్రేమ కాబట్టే వారికి పెద్ద ఎత్తున సీఎంఆర్ ఎఫ్ రూపంలో పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అంద జేస్తున్నారని అన్నారు. నామ అంటేనే సేవకు ప్రతి రూపమని ఎమ్మెల్యే రాములు నాయక్ కొనియాడారు. ఉక్కు మనిషి తెలంగాణ జాతిపిత సీఎం కేసీఆర్ అని, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరం పయనించి బంగారు తెలంగాణాకు మరిన్ని బాటలు వేయాలని అన్నారు.కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు .ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పలు పథకాలు , అభివృద్ధి గురించి విస్తృతంగా ప్రజల్లోకి తీసు కెళ్లాలని చెప్పారు. మన ఇంట్లో కార్యక్రమం మాదిరిగా ప్రతి ఒక్కరూ దశాబ్ది వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు .75 ఏళ్లుగా జరగని అభివృద్ధి కేవలం తొమ్మిదేళ్ళలో చేసి చూపించిన ఘనత కేసీఆర్ కే దక్కు తుందని అన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి వల్ల నేడు తెలంగాణ దేశానికి దిక్సూచిగా మరి అభివృద్ధిలో నెంబర్ వన్ స్థాయిలో ఉందని తెలిపారు. కేసీఆర్తో నవశకం ప్రారంభమైందన్నారు. తెలంగాణ రాకముందు కరువు, కాటకాలు ,ఆత్మ హత్యలు , వలస బతుకులు ఉండేవని, తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణా దేశంలోనే నెంబర్వన్ గా ఉందని చెప్పారు .రానున్న ఎన్నికల్లో కేసీఆర్ ను మళ్ళీ గెలిపించుకొని మరింత అభివృద్ధి సాధించాలని అన్నారు .నేడు యావత్ దేశం టిఆర్ఎస్ పార్టీ వైపు చూస్తుందని తెలిపారు .ప్రపంచ చరిత్రలో తెలంగాణ అభివృద్ధిని ఎవరూ అందుకోలేరని చెప్పారు. ఎన్ని పార్టీలు వచ్చినా, ఎంత మంది పగటి వేషగాళ్ళు వచ్చినా కెసిఆర్ను ఏమి కదిలించలేరని పేర్కొన్నారు. జిల్లాలో పండుగ వాతావరణంలో జరిగే దశాబ్ది ఉత్సవాలల్లో పెద్దఎత్తున భాగస్వామ్యమై విజయవంతం చేయాలని నల్లమల వెంకటేశ్వ రరావు అన్నారు. రైతు కార్యక్రమంలో అన్నదాతలు సహా అందరూ పాలు పంచు కోవాలన్నారు. రైతు కార్యక్రమంలో ఉత్తమ రైతులను సన్మానించడం జరుగుతుందని చెప్పారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అన్నారు. అందుకే నేడు దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అమలు చేస్తున్నారని తెలిపారు. పార్టీల కతీతంగా ప్రతి ఇంటికి ఏదో రూపంలో లబ్ది చేకూరుస్తున్న సీఎం కేసీఆర్ రాబోయే కాలంలో మరింత అండగా ఉండి, మూడోసారి సీఎంగా చేసుకోవాలన్నారు. పార్టీ వైరా పట్టణ అధ్యక్షులు మద్దెల రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమంలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతాములు ,ఏం సి చైర్మన్ బి డి కే రత్నం , ఎంపీపీ వేల్పుల పావని ,జిల్లా నాయకులు బత్తుల శ్రీనివాసరావు, వైరా జెడ్పిటిసి నంబూరి కనకదుర్గ, జూలూరుపాడు జడ్పిటిసి భూక్య కళావతి ,వైరా మండల పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, కొనిజర్ల మండల పార్టీ అధ్యక్షులు చిరంజీవి, ఏన్కూరు మండల పార్టీ అధ్యక్షుడు బాణోత్ సురేష్ , దిశా కమిటీ సభ్యులు కట్ట కృష్ణార్జునరావు, పార్టీ జిల్లా ఎల్లంకి సత్యనారాయణ,పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు, పీఏసీఎస్ చైర్మన్ చెరుకుమల్లి రవి, వనమా విశేశ్వరరావు, కాపా మురళి, మచ్చా నరసింహారావు, భూమాత కృష్ణమూర్తి, నరసింహారావు, బాణోత్ సక్కుబాయి, రవీందర్రెడ్డి, కిలారి మాధవరావు నాగేశ్వరరావు, ధర్మారావు, వీరభద్రం, బండారు కృష్ణ, తోటకూరి రాంబాబు, ఐలయ్య, వెంకట్రాంరెడ్డి ,మిట్టపల్లి సత్యంబాబు, అజ్మీర వీరన్న తదితరులుతో పాటు సోషల్ మీడియా వైరా నియోజకవర్గ ఇంచార్జి నరేష్ పాల్గొన్నారు.



## బహుజన కార్మికుల హక్కుల సాధనకోసం పోరాటం

**అన్ని రంగాల్లోని కార్మికులను ఐక్యం చేయటమే లక్ష్యం**

**బహుజన కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి మట్టే గురుమూర్తి**

**ఖమ్మం, జూన్ 1 (విజయమ్ న్యూస్):**

బహుజన కార్మికుల హక్కుల సాధన కొరకు నిరంతరం పోరాటం చేస్తూ, సమస్త రంగాల్లో ఉన్నటువంటి కార్మికులను ఐక్యం చేయడమే లక్ష్యంగా బహుజన కార్మిక విభాగం పనిచేస్తుందని బహుజన కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మట్టే గురుమూర్తి అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మట్టే గురుమూర్తి మాట్లాడుతూ.. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, బహుజన రాజ్యాధికార ముఖ్యమంత్రి అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో బహుజన కార్మికుల హక్కుల కొరకు సమస్త రంగాల్లో పోరాటం చేస్తామన్నారు. బహుజన కార్మికులను సమాయత్వం చేయుటకు బహుజన కార్మిక విభాగం ఇకనుండి ముందు వరుసలో ఉంటుందన్నారు. మున్సిపాలిటీ, విద్యా, వైద్య, పంచాయతీ రంగాలలోని కార్మికులు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ విభాగాల్లో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి మోసం చేశారని దుయ్యబట్టారు. గత పదేళ్లుగా ఏం చేయని ప్రభుత్వం, 21రోజుల్లో దశాబ్ది ఉత్సవాల పేరుతో ఏం చేస్తారని విమర్శించారు. కార్మిక హక్కుల సాధన కొరకు రాజ్యాంగ బద్దంగా రావాల్సిన సమస్త హక్కుల సాధనకు ఉద్యమాన్ని దశలవారీగా ఉధృతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా 'బహుజన కార్మిక విభాగం' ఖమ్మం జిల్లా కమిటీని ప్రకటించారు. అధ్యక్షులుగా ఊటుకూరి నాగేశ్వరావు, ప్రధాన కార్యదర్శిగా పుచ్చకాయల రవి యాదవ్, ప్రచార కార్యదర్శిగా పల్లెపొంగు మాధవరావు, ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులుగా నారపోగు నాగేశ్వరావు, ప్రచార కార్యదర్శిగా మసి నాగరాజు, అదేవిధంగా ఖమ్మం అసెంబ్లీ అధ్యక్షుడిగా నల్లగట్ల సతీష్, పాలేరు అసెంబ్లీ అధ్యక్షుడిగా నల్లగట్టు మధు, మధిర అసెంబ్లీ అధ్యక్షుడిగా గద్దల శ్రీనివాస్ ను ప్రకటించారు.



## నిరుపేద నవ వధువు కు రూ.10 వేలు ఆర్థిక సహాయం చేసిన ఎంపీ వద్దిరాజు

**(ఖమ్మంప్రతినిధి-విజయమ్ న్యూస్)**

రఘునాధపాలెం మండలం చిమ్మపూడి గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన ముత్యాల సత్యనారాయణ,శైలజ లకు ఇద్దరు సంతానం.ఏకైక కుమార్తె నవ వధువు ముత్యాల మానస కు ఇల్లందు సమీపంలోని గంధంపల్లి కి చెందిన మాధం శెట్టి ఉమేష్ తో వివాహం నిశ్చయమైంది. వివాహం గురువారం(నేడు) భద్రాచలంలోని సీతారాముల స్వామి సన్నిధిలో జరగనుంది. రెక్కాడితే కానీ,డొక్కాడని నిరుపేద కుటుంబ ఆర్థిక పరిస్థితి ని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మానవీయ కోణంలో ఆలోచించి రూ.10 వేలు ఆర్థిక సహాయం చేసి మానవత్వం చాటుకున్నారు. అట్టి ఆర్థిక సహాయాన్ని మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ చేతుల మీదుగా నవ వధువు మానస స్వగృహానికి బుధవారం వెళ్లి ఆర్థిక సహాయంను అందజేశారు. ఈ కార్యక్రమంలో జమ్మిశెట్టి నిరంజన్, ముత్యాల రాంబాబు, జలగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# తెలంగాణ బిడ్డలకు శుభాకాంక్షలు

- మహానేత కేసీఆర్ తెలంగాణను గొప్పగా తీర్చిదిద్దారు,
- ఇంకా అభివృద్ధి చేస్తున్నారు
- బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం,కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యం
- తెలంగాణ అమరవీరుల దివ్య స్మృతికి ఘన నివాళులు:ఎంపీ రవిచంద్ర

**(ఖమ్మంప్రతినిధి-విజయమ్ న్యూస్)**



రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ వాసులకు, దేశవిదేశాలలో స్థిరపడిన,నివాసం ఉంటున్న తెలంగాణ బిడ్డలందరికి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు మహోన్నత ఉద్యమాన్ని నడిపి సాధించి పెట్టిన తెలంగాణ రాష్ట్రాన్ని గొప్పగా తీర్చిదిద్దారని,ఇంకా అభివృద్ధి చేస్తున్నారన్నారు.మన స్వరాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు, యాదాద్రి పుణ్యక్షేత్రం,125 అడుగుల బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం, సచివాలయం, పోలీసు కమాండ్ కంట్రోల్,అమరవీరుల స్మృతి కేంద్రం వంటి అద్భుతమైన నిర్మాణాలు జరిగాయని పేర్కొన్నారు.అలాగే, కేసీఆర్ సుపరిపాలనలో విద్యుత్,తాగు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు.దండుగ అనుకున్న వ్యవసాయాన్ని పండుగ చేసి ఆచరణలో నిరూపించి తెలంగాణను దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దిన మహనీయులు కేసీఆర్ అని కొనియాడారు.పంట పెట్టుబడి కోసం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి 65లక్షల మంది రైతులకు 65,000కోట్లు ఉచితంగా అందించిన విషయాన్ని రవిచంద్ర గుర్తు చేశారు.ఏటా 13,000 కోట్లు ఖర్చు చేస్తూ సుమారు 46లక్షల మందికి ఆసరా పింఛన్లు అందజేస్తున్నామని చెప్పారు.కొద్దికాలంలోనే అన్ని రంగాలలో తెలంగాణ అభివృద్ధి చెందిన తీరు,రాష్ట్రం సుభిక్షంగా వర్థిల్లుతుండడాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు శుక్రవారం నుంచి 21రోజుల పాటు దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకోనున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న కేసీఆర్ ఎదురులేని మహానాయకులని,కొద్ది నెలల్లో జరగనున్న ఎన్నికలలో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం,ఆయన మూడవ సారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకలు జరుపుకుంటున్న వేళ తెలంగాణ అమరవీరుల దివ్య స్మృతికి ఎంపీ వద్దిరాజు ఘన నివాళులర్పించారు.



## జె కె ఉపరితల గని నందుఉద్యోగులకు భద్రతపై అవగాహన

**(ఇల్లెందు-విజయం న్యూస్)**

ఇల్లందు ఏరియాలోని జేకే 5 ఉపరితల గని నందు జనరల్ మేనేజర్ భద్రతపై అవగాహనా ఈ రోజు ఇల్లందు ఏరియాలోనే జెకె ఉపరితల గనిపై నిర్వహించిన భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి పని ప్రదేశాలలో అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన పనులను భద్రతతో చేయాలని, రక్షణ పరికరాలు ధరించాలని, నూతన ప్రాజెక్ట్ పనులు చకచక జరుగుతున్నాయని తెలిపారు. తదుపరి జూన్ 5న జెకె కాలనీలోనే సింగరేణి పాఠశాల మైదానంలో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సింగరేణి సంస్థ యాజమాన్యం ఇల్లందు ఏరియా నిర్వహిస్తున్న సింగరేణి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నామని, కావున ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అదేవిధంగా గనులు విభాగాలలో నిర్వహించే ఉత్సవాలలో ఉద్యోగుల అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ పంజాల శ్రీనివాసు, మైన్ మేనేజర్ పి.పూర్ణచందర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ చిన్నయ్య, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, డి.వై.పి.యం జి.శ్రీహరి, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షులు ఎస్. రంగనాథం, సంజీవరావు ఇతర అధికారులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే స్వగ్రామంలో ఆలయ ప్రారంభమహోత్సవ వేడుకలు

### హాజరైన ఎమ్మెల్యే కందాళ కుటుంబ సభ్యులు

**(కూసుమంచి-విజయమ్ న్యూస్)**

కూసుమంచి మండలం రాజుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ,విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు గురువారం ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. కుటుంబ సమేతంగా పాల్గొన్న పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, సతీమణి విజయమ్మ ప్రత్యేకంగా పూజలు చేశారు. హోమాలు చేసిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, ఆ తరువాత ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ వాసంశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మోదుగు వీరభద్రం, ఉపసర్పంచ్ గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ముత్యాల గూడెంలో బంగారు మైసమ్మ ఆలయ ప్రారంభం

## విగ్రహప్రతిష్టమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందాళ, ప్రజాప్రతినిధులు

**(కూసుమంచి-విజయమ్ న్యూస్)**

కూసుమంచి మండలంలోని ముత్యాల గూడెం గ్రామంలో నూతనంగా నిర్మాణం చేసిన బంగారు మైసమ్మ దేవాలయాన్ని గురువారం పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాదిగల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. విగ్రహప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. గత కొన్ని నెలల క్రితం గ్రామంలోని ముత్యాలమ్మ, ఎల్లమ్మ, బంగారు మైసమ్మ గుళ్ళకు నాలుగు లక్షల ఆర్థిక సహకారం చేయగా, ఇతర దాతలు కూడా కొంత అర్థిక చేయూతనందించారు. దేవాలయాల నిర్మాణం పూర్తి చేసుకొని విగ్ర ప్రతిష్ట దేవుళ్ళ పండుగ గురువారం నిర్వహిస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే కందాల ఉపేందర్రెడ్డి ని గ్రామంలోకి మనసారా ఆహ్వానించి మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కందల మాట్లాడుతూ ముత్యాల గూడెం గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గంలో ప్రతి ఒక్కరూ మంచి సదువులు చదువుకొని ఆరోగ్యంగా ఉండాలని ఒకవేళ ఎవరైనా చదువుకోలేని ఆర్థిక పరిస్థితుల్లో ఉంటే తన వంతుగా సహకరిస్తానని హామీ ఇస్తూ అందరూ పిల్లలను చదివించాలని ప్రత్యేకంగా నొక్కి చెప్పారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు అనంతరం శిలాఫలాకాన్ని ఆవిష్కరించి అందరూ ప్రశాంతంగా పండుగ నిర్వహించుకోవాలని ఆయన శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాలేరు ఆత్మ కమిటీ కమిటీ చైర్మన్ రామ సహాయము బాలకృష్ణారెడ్డి, కూసుమంచి ఎంపీపీ బి. శ్రీనివాస్, డిసిసిబి డైరెక్టర్ శేఖర్, బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా నాయకులు మల్లిడి వెంకన్న, చేగోమ్మ ఎంపీటీసీ ఊడుగు జ్యోతి వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ కూసుమంచి



మండల అధ్యక్షులు వేముల వీరన్న, ప్రధాన కార్యదర్శి ఎం డి ఆసిఫ్ పాషా, ముత్యాల గూడెం బిఆర్ఎస్ నాయకులు చాగంటి శ్రీనివాస్ .నల్లమోతు శ్రీనివాస్, ముత్యాల గూడెం బంగారు మైసమ్మ ఆలయ అధ్యక్షులు పేరెల్లి ఉపేందర్ .ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి మల్సూర్. కోశాధికారి మాతంగి భార్గవ్. సభ్యులు పేరెల్లి వీరయ్య. పి వీరయ్య. గ్రామ పెద్దలు మాతంగి రామస్వామి. పేరెల్లి వెంకన్న. శ్యాంబాబు. పేరెల్లి శ్రీనివాస్. పేరెల్లి మధు .తదితరులు పాల్గొన్నారు.



## కూసుమంచిలో బంగారు మైసమ్మ ఆలయానికి శంకుస్థాపన

### హాజరైన సర్పంచ్, ఎంపీటీసీ, మాదిగ కులస్తులు

**(కూసుమంచి-విజయమ్ న్యూస్)**

కూసుమంచి మండల కేంద్రంలోని దళిత కాలనీలో బంగారు మైసమ్మ ఆలయ నిర్మాణానికి గురువారం భక్తులు శంకుస్థాపన చేశారు. గ్రామంలోని మాదిగ కులస్తులు, యువకులందరు కలిసి స్వచ్ఛందంగా కులస్తుల భాగస్వామ్యంతో ఆలయాన్ని నిర్మాణం చేసుకుంటుండగా, గురువారం మంచిరోజు కావడంతో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ చెన్నా మోహన్, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, యువకులు, దళితులు హాజరై ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాదాసు ఉపేందర్ మాట్లాడుతూ స్వచ్ఛందంగా మా యువకులు ముందుబడి భారీగా డబ్బులు సేకరించి స్వంతంగా బంగారు మైసమ్మ ఆలయాన్ని నిర్మాణం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని, యువకులు బానిస బతుకులను వదిలి స్వేచ్ఛమైన జీవితాన్ని ప్రారంభించాలని కోరారు.

## సర్కార్ కార్యాలయాల్లో జిగేల్

**ఖమ్మం, జూన్ 1 (విజయమ్ న్యూస్):**

తెలంగాణ రాష్ట్రం అవిర్భవించి పదేళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దశాబ్ధ ఉత్సవాలను ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అద్భుతంగా ఎవరు ఊహించని విధంగా దశాబ్ధ వేడుకలను నిర్వహించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా దశాబ్ధ ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు అధికారులు, అధికార పార్టీ నాయకులు, ప్రజలు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వాధికారులు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలన్నింటికి ప్రత్యేకంగా లైట్లు ఏర్పాటు చేసి జిగెల్ అనే విధంగా తయారు చేశారు. నూతన కలెక్టరేట్ తో పాటు పాత కలెక్టరేట్, జడ్పీహాల్ అన్ని ప్రభుత్వ కార్యాలయాలను అందంగా తీర్చిద్దాదరు.

## రామాలయంలో గాలిగోపురం ప్రతిష్ఠ

### - హాజరైన ఎంపీ ఎంపీ రవిచంద్ర దంపతులు



**(ఖమ్మం-విజయమ్ న్యూస్)**

ఖమ్మం ఎన్ఎస్పీ కాలనీలోని సీతారామాంజనేయ ఆలయ మహారాజ గాలిగోపురం ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర-విజయలక్ష్మీ దంపతులకు వేద పండితులు పూర్ణకుంభం,మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు.గాలి గోపురంతో పాటు ప్రతిష్ఠాపన జరిగిన లక్ష్మీదేవి, అండాలు, గోదాదేవి జయవిజయ అమ్మ వార్లకు, శ్రీసీతారామచంద్ర, ఆంజనేయ స్వాములకు రవిచంద్ర-విజయలక్ష్మీ దంపతులు గోత్రనామంతో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా వేదపండితులు వారికి ఆశీర్వచనాలు పలికి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. రవిచంద్ర-విజయలక్ష్మీ దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. గాలిగోపురం ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు రామనామస్మరణతో మారుమ్రోగాయి. సుమారు మూడు గంటల పాటు కొనసాగిన ఈ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రద్ధాసక్తులతో పూజలు చేశారు. రాజగోపురం ప్రతిష్ట అనంతరం ఆలయ మెట్ల మార్గం నుంచి అతిథులు, భక్తులు రాజ ప్రవేశం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పోరేటర్లు పగడాల శ్రీవిద్య, శీలంశెట్టి వీరభద్రం, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, శ్రీరామ భక్తమండలి ఛైర్మన్ మోత్కూరు మురళీధర్ రావు, ఆలయ పూజారి వెంకటరమణాచార్యులు, నగర ప్రముఖులు పారా నాగేశ్వరరావు ఆకుల గాంధీ, శెట్టి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అత్యంత క్లిష్ట సమయం.. ప్రపంచం వణుకుతున్న సందర్భం.. మీడియా మొత్తం భయపడుతున్న తరుణం.. ఆ సమయంలో ఎంతో ధైర్యం చేసి తెలంగాణ అవిర్భవం సందర్భంగా జూన్ 2, 2021 సంవత్సరంన 'విజయం' తెలుగు దినపత్రికను స్థాపించాను.. ఎంతో మంది భయపెట్టారు.. ఎంతో మంది హేళన చేశారు.. ఎంతో మంది కించపరిచారు.. పత్రిక నడపలేవు అని అన్నారు.. అయినప్పటికి ధైర్యంతో ముందుకు అడుగువేశాను.. 'జనం కోసం జర్నలిజం' అనే ట్యాగ్ లైన్ తో 'విజయం' తెలుగు దినపత్రికను స్థాపించడం జరిగింది.. నేటికి 2 ఏళ్లు పూర్తి చేసుకుని మూడవ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది.. రెండేళ్ల ఈ సమయం చాలా గడ్డు సమయం.. కరోనా తీవ్ర జఠిలమైన సమయం.. అయినప్పటికి ధైర్యంతో, సాహసం చేసి పత్రికను నడిపిస్తూ ముందుకు వెళ్తున్నాము.. రాజకీయాలకు సంబంధం లేకుండా.. ఏ పార్టీకి అనుకూలం కాకుండా.. ప్రజలందరు మాకు సమానమే అంటూ..ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం.. ప్రజా సమస్యలను ప్రభుత్వాధికారులకు చేరవేయడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిజమైన 'పోర్త్ ఎస్టేట్' అనే పధానికి నిదర్శనంగా అనేక అద్భుత కథనాలను ప్రచురుతం చేస్తూ పాఠకులకు, ప్రజలకు అందించి మెప్పించడం జరిగింది.. తాజా వార్తలను, తాజా రాజకీయ పరిస్థితులను నిశ్వార్థంగా ప్రజలకు అందించి, అభినందనలు అందుకున్నందుకు సంతోషంగా ఉంది.. ఎన్నో ఒడుదుడుకులు.. ఎన్నో కష్టాలు.. ఎన్నో నష్టాల నడుమ విజయం పత్రికను ముందుకు తీసుకెళ్తున్నాము.. ఇన్నేళ్లపాటు ప్రజలందరు, పాఠకులందరు మా పత్రికను ఆశీర్వదించారు.. మరింతగా ముందుకు నడిపించారు..ఇక ముందు కూడా మరింత మంది మా పత్రికను, పత్రికలో పనిచేసే ప్రతి జర్నలిస్టులను ఆశీర్వదిస్తారని 'నమ్ముతున్నాము.. మా లక్ష్యం నిశ్వార్థమైన జర్నలిజం'.. 'మా ధ్యేయం జనం కోసం నిజం రాయడమే మా జర్నలిజం'.. 'మా తత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడమే మా జర్నలిజం'.. 'మా నైజం విలువలతో కూడిన జర్నలిజం'.. భయపడి జర్నలిజయం చేయం.. భయపెట్టే వార్తలు రాయం.. సమసమాజ నిర్మాణం కోసం మా విజయం పత్రిక ముందుకు సాగుతుంది.. అందుకు మా లక్ష్యానికి మీ సపోర్టు కావాలి.. సమానత్వజర్నలిజానికి మీ సంపూర్ణ మద్దతు కావాలి.. అందుకే మా పత్రికకు అడ్వటేజ్ మెంట్ అందించి ఆశీర్వదిస్తారని మనస్పూర్తిగా కోరుకుంటూ.. మా బలం..మా బలగం మీరే.. మరోసారి మీ అందరికి 'విజయం' తెలుగు దినపత్రిక రెండవ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

మీ..
పెంద్ర అంజయ్య
చైర్మన్ అండ్ ఎడిటర్

## రాజకీయాల్లో కెసిఆర్‌ది
# సక్సెస్ ఫార్ముళా..!

ప్రణాళికాబద్ద రాజకీయాలకు పెట్టింది పేరు కెసిఆర్. తెలంగాణ ఉద్యమాన్ని,ఆటుపోట్లను బాగా ఔపోసన పట్టిన తరవాతనే.. దాన్ని సాధించేందుకు ఎంచుకున్న మార్గంలో ఓ సక్సెస్ ఫార్ములాను ఆయన అనుసరించారు. ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ముందుకు సాగే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను ఇక్కట్లను ఎలా అధిగమించాలో కూడా ఆయన తన రోడ్ మ్యాప్‌లో నిర్దేశించుకున్నారు. రాకెట్ ప్రయోగంలో ఎలాంటి ప్రణాళిక ఉంటుందో తెలంగాణ సాధనలోనూ..తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటులోనూ.. పథకాలను అమలు చేయడంలోనూ.. అంతకు మించిన ప్రణాళిక దాగివుంది. అందుకే ఆయన రాజకీయ జీవితం అప్రతిహతంగా కొనసాగుతోంది. గుడ్డెద్దు చేల్లో పడ్డట్లుగా కెసిఆర్ రాజకీయాలు చేయరని ఆయన సక్సెస్‌ను గమనించిన వారు చెబుతారు. గత ఎన్నికల్లో మరోమారు విజయం సాధించడంలోనూ.. ఎన్నికలను ముందుకు జరిపి ముందస్తుకు వెళ్లడంలోనూ అనూహ్యమైన ప్రణాళిక ఉంది. ప్రజలనాడి పట్టకుండా రాజకీయాలు చేసే వారు ఫెయిల్ అవుతారు. ఇది బాగా ఎరిగిన వారు సక్సెస్ అవుతారు. అందుకే రాజకీయాల్లో కెసిఆర్ సాధించిన విజయాలు మరు పార్టీ లేదా నేత సాధించలేక పోతున్నారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టిన సందర్భంలో ఆయన విజయానికి ఇదే కారణం. కానీ ప్రణాళికా లోపంతో ఎన్టీఆర్ వంచనకు గురయ్యారు. ఎపిలో కూడా జగన్ ప్రజలనాడి తెలుసుకుని ..చంద్రబాబు వ్యతిరేకాంశాలతో పాదయాత్రలో ప్రజలకు నమ్మకం కలిగించారు. అందుకే అక్కడ అధికారంలోకి వచ్చారు. అయితే వచ్చిన అధికారం నిలబెట్టుకునేందుకు పడుతున్న తంటాలు వేరు. చంద్రబాబు కూడా మామను వెన్నుపోటు పొడిచినంత ఈజీగా ప్రజల్లో అనుకూలతను సాధించలేకపోయారు. దేశ రాజకీయాల్లో కెసిఆర్‌ది మాత్రమే ఓ సక్సె ఫార్ములాగా చెప్పుకోవాలి. ఇక తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను తలకెత్తు కునే ముందు కెసిఆర్ కూడా ఎంతగానో మేధోమథనం చేశారు. తను ఎంచుకున్న మార్గంలో ముళ్లు, రాళు ,,ఎగుడుదిగుడులు ఉంటాయిని తెలిసీ..వాటిని ఎలా తొలగించుకుంటూ ముందుకు సాగాలో కూడా ప్రణాళిక మేరకు ముందుకు సాగారు. ఆయనను దగ్గరగా చూసిన వారికి ఆయన రచిస్తున్న వ్యూహాలు తెలుసు. నెలల తరబడి నిద్రాహారాలు కూడా మానేసి ఆయన ఓ రోడ్డు మ్యాప్ గీసుకుని ముందకు నడిచారు. ఆషామాషీగా ఆయన రంగంలోకి దిగలేదు...దిగిన తరవాత వెనుదిరిగి చూడలేదు. తెలంగాణ ఉద్యమంలో సాధించిన విజయంతో ప్రభుత్వాన్ని కూడా తను ఏర్పాటు చేస్తేనే సాధించుకున్న తెలంగాణ ఆకాంక్షలు సాకారం అవుతాయని భావించారు. అందుకే ఆయన వెంట ప్రజలు కూడా నమ్మకంగా నడిచారు. ప్రజల నాడిని పట్టి..వారి ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగడం.. రాజకీయాల కోసం ఎత్తులు పై ఎత్తులు వేయడం కెసిఆర్‌కు మాత్రమే తెలిసిన విద్య. జాతీయ రాజకీయాల్లో ఆయన ఉండి వుంటే ఈ పాటికి వేరుగా ఉండేది. కెసిఆర్‌కు దేశం మీద అవగాహన ఉంది. నదుల మీద..వాటి నడక మీదా అవగాహన ఉంది. అన్నింటికి మించి ప్రజల జీవన విధానంపై లోతైన అవగాహన ఉంది. ప్రపంచ గమనంపైనా అవగాహన ఉంది. ప్రపంచ రాజకీయా లతో పాటు, దేశ రాజకీయాలను బాగా ఔపోసన పట్టిన వ్యక్తి. దేశంలో మోడీతో పోల్చుకుంటే కెసిఆర్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయగల సత్తా ఉన్న నేత. దేశంలో ఉన్న వనరులు, వాటిని ఉపయోగించుకునే తీరు కూడా బాగా తెలిసిన వాడు. తెలంగాణలో 24 గంట నిరంతర విద్యుత్‌ను ఇవ్వగలిగడంలోనే ఆయన దార్శనికతను అర్థం చేసుకోవచ్చు. నిరంతర విద్యుత్ ఉంటే చిన్న,పెద్దా పరిశ్రమల ఉత్పత్తి రంగం దెబ్బతినదని కూడా బాగా తెలుసు. అందుకే నిరంతర విద్యుత్‌ను సాకారం చేసిన నేత.. నిజానికి దేశ వ్యాప్తంగా నిరంతర విద్యుత్ ఎందుకు ఇవ్వలేక పోతున్నారో ఇప్పుడు ఆలోచన చేయాలి. దేశంలో పారుతున్న నదులను కూడా ఎలా ఉపయోగించుకోవాలో కూడా బాగా తెలిసిన వ్యక్తి కెసిఆర్. అందుకు గోదావరి జలాలను ఎదురెక్కించి రిజర్వాయర్లను కట్టించిన తీరు అద్బుతం కాక మరోటి కాదు. కాళేశ్వరంతో మొదలు పెట్టి..కొండపోచమ్మ సాగర్ వరకు నీటి రాకను చూస్తే అద్భుతం అని చెప్పని వారు ఉండరు. ఒక రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయవచ్చో.. అన్నది కేవలం ఈ తొమ్మిదేళ్లలో చేసి చూపారు. కాళేశ్వరంతో పాటు అనేక ప్రాజెక్టులను కట్టడం, చెరువులను పునరుద్దరించి గొలుసుకట్టు చెరువులకు ప్రాణం పోయడం, మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేయడం,హరితహారంతో పచ్చదనాన్ని పెంచి మొక్కల పెంపక ప్రాధాన్యాన్ని గుర్తించారు. జిల్లాల విభజనతో పాలనను ప్రజలకు చేరువ చేశారు. అన్నింటికి మించి యాదాద్రి ఆలయాన్ని నభూతో నభవిష్యత్ అన్న రీతిలో పునరుద్దరించి..కాకతీయకళావైభవాన్ని కళ్లకు చాటారు. ఇవన్నీకూడా విప్లవాత్మక నిర్ణయాలే. ఇదే తరహాలో దేశ పగ్గాలు అందుకుంటే ఖచ్చింతంగా ఓ నాలుగైదేళ్లలో గణనీయమైన మార్పులు చూపి..ప్రజలకు ఆదర్శ నేతగా నిలిచే సత్తా కూడా కేవలం కెసిఆర్‌కు మాత్రమే ఉందనడంలో సందేహం లేదు. నిజానికి కెసిఆర్ బిజెపి లాంటి పార్టీలో ఉండివుంటే మోడీకి అవకాశం వచ్చేది కాదు. మోడీకి లేని విజన్ కెసిఆర్‌కు ఉందనడంలోనూ సందేహం లేదు. మోడీది ప్రచార ..పటాటోపం తప్ప మరోటి కాదు....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో నేటికీ మోడీ పెద్దగా విజజయం సాధించలేదు. అందుకే రాజ్యాంగం కొత్తది రాసుకోవాలన్న కెసిఆర్ డిమాండ్ వెనక ప్రజల ఆకాంక్షలు బలంగా ఉన్నాయి. ప్రజల నాడిని పట్టిన నేతగానే కెసిఆర్ ఇలాంటి డిమాండ్ చేశారు. దీనిపై చర్చచేయకుండా కేవలం కెసిఆర్‌పై దుమ్మెత్తి పోస్తే కెసిఆర్‌కు పోయేదేమీ లేదు. కెసిఆర్ మాత్రమే దేశ రాజకీయాలపై దగ్గరగా అవగాహన కలిగి ఉన్నారు. దేశం పట్ల ఆయనకు ఓ స్పష్టమైన విజన్ ఉంది. అందుకే తెలంగాణ ఉద్యమంలో ఎవరెవరిని ఎలా వాడుకోవాలో అన్న ప్రణాళికతోనే కార్యక్షేత్రం లోకి దిగారు. తెలంగాణ అసాధ్యం అన్నదానిని సుసాధ్యం చేసి చూపారు. జాతీయస్థాయిలో ఏయే రాజకీయ పార్టీతో నెయ్యం చేయాలో చేశారు. ఎవరెవరిని మచ్చిక చేసుకోవాలో చేసుకున్నారు. ఇలా తెలంగాణను సాకారం చేయడంతో పాటు, పాలనలో తనదైన ముద్ర వేయగలిగారు. ఇప్పుడంతా విమర్శిస్తున్నట్లుగా కెసిఆర్‌పై ప్రజల్లో పెద్దగా వ్యతిరేక కూడా లేదు. మెజార్టీ ప్రజలకు కెసిఆర్ అంటే కోపం కూడా లేదు. రాజకీయ పార్టీల హడావిడి , విమర్శలు తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇంతకుమించి చేయగలిగిన నేత ఇతర పార్టీల్లో లేరు.అంతెందుకు తెలంగాణలో కెసిఆర్‌ను మించిన విజనరీ నేత లేదనడంలో ఏమాత్రం అతిశయోక్తి కూడా లేదు. అందుకే నూరు కాదు..నూటి ఐదు సీట్లు గెలుస్తామన్న ధీమాలో కెసిఆర్ ఉన్నారు. ఈ ధీమా వెనక కూడా బృహత్తర ప్రణాళిక దాగివుంటుంది. అదే సాకారం అవుతుందని మరోమారు మనం గమనించక తప్పదు.

# పథకాలన్నింటిలో కెసిఆర్ ముద్ర

## పాలనలో ప్రత్యేకమైన శైలి
## ప్రజలకు చేరువగా పథకాలు

**హైదరాబాద్,జూన్1(విజయవమ్ న్యూస్)**

అనేక ఆశలు,ఆశయాలతో, అమరుల త్యాగాలతో పురుడుపోసుకున్న తెలంగాణను అభివృద్ధిపథంలో తీసుకెళ్లేందుకు కెసిఆర్ నాయకత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నతీరు ఇప్పుడు దేశానికి దిక్సూచి అనేలా ముందుకు సాగుతున్నారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లుగా అనేక విజయాలు సాధించారు. పది జిల్లాల తెలంగాణను 31 జిల్లాలుగా విభజిస్తూ కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో పాలన ప్రజలకు చేరువైంది. జిల్లా కేంద్రాలు కూతవేటు దేరంలోకి వచ్చాయి. సుపరిపాలన దిశగా సుస్థిర పాలన అందించటం క్లిష్టమైనదే కాకుండా కష్టసాధ్యమైనది కూడా. రాష్ట్ర ఏర్పాటుకు పోరాడడం ఒక ఎత్తయితే, సుస్థిరాభివృద్ధికి సుపరిపాలన ఎంతో అవసరం. ఆ దిశగా వేస్తున్న అడుగులు సహజంగానే ఇతరులకు పెద్దగా కనిపించకపోవచ్చు. అవి అడుగులే కాదనే వారు ఉంటారు.కానీ కెసిఆర్ మాత్రం ఒక్క అడుగే వేల కిలోమీటర్ల ప్రయాణానికి పునాది అంటారు. అందుకే తాను నమ్ముకున్న బాటలో సాగడానికి ఆయన విమర్శలను పక్కన పెట్టారు. అందుకే అచిర కాలంలోనే దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాల రూపకల్పనలో తనదైన ముద్రను వేశారు. అనేక కార్యక్ర మాల్లో రైతాంగ సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలే విప్లవాత్మకంగా నిలవనున్నారు. రైతులు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా వ్యవసాయం చేసుకుని బంగారు పంటలు పండించేలా రైతులకు సకల హంగులు సమకూరుస్తున్న తీరు దేశవ్యాప్తంగా ఆకర్శితమవుతోంది. రైతులకు జీవితబీమా పథకం అన్నది ఓ గొప్ప ఆలోచన. దానిని అమలు చేస్తే రైతులకు ఇక ఆత్మహత్యల శరణ్యం రాదు. ఇప్పటికే అనేక రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తరుణంలో ఈ పథకం గొప్ప వరంగా భావించాలి. రాష్ట్రంలోని ప్రతి రైతుకు రూ.5 లక్షల జీవితబీమా పథకం నిర్వహణ ఆసరాగా మారింది. వ్యవసాయరంగం అభివృద్ధి కోసం రైతుబంధు పథకం ప్రారంభించి ఎకరానికి ఏటా పదివేలు పెట్టుబడి సాయం అందించడం తోపాటు, రైతుబీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఈ తొమ్మిదేళ్ల పాలనలో తీసుకున్న నిర్ణయాలను, అమలువుతున్న తీరును ప్రజల్లోకి గట్టిగా తీసుకుని వెళ్లేలా కార్యాచరణకు సిద్ధం అవుతున్నారు. తెలంగాణలో రైతులకు, ప్రజలకు నమ్మకం భరోసా కల్పించడం లో సీఎం కేసీఆర్ విజయం సాధించారనే చెప్పాలి. టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలను ఆకర్షిస్తున్నాయని నేతలు పదేపదే అంటున్నారు. కేసీఆర్ తీసుకున్న ప్రతి పథకం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నదని, త్వరలోనే జాతీయస్థాయిలో అన్ని పార్టీలకు ఇవే మ్యానిఫెస్టోలు కానున్నాయని తెలిపారు. కరువులేని రాష్ట్రంగా మార్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారు. గత తొమ్మిదేళ్లలో అనేకానేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపదించిన గులాబీనేత కెసిఆర్ కూడా ఈ దశాబ్దివేళ తన అభివృద్ధి మంత్రాన్ని ప్రజలకు వివరించనున్నారు. ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం చేపట్టిన జిల్లాల పునర్విభజన, పింఛన్లు-జీవనభృతి, మైనారిటీ సంక్షేమం, మౌలికవసతుల కల్పన, రైతుబంధు, రైతుబీమా, ప్రాజెక్టుల నిర్మాణం, విద్యావైద్యంపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారంలో ఉన్నవే. ఇకపోతే మంచినీటికోసం మిషన్ భగీరథ, సాగునీటి కోసం మిషన్ కాకతీయ, 24 గంటల విద్యుత్ సౌకర్యం వంటివి విజయవంతంగా అమలు జరుగుతన్నాయి. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, వికలాంగులు ఇలా అందరికీ పింఛన్ అందిస్తున్న తీరు కూడా ఆసారగా నిలిచింది. గతంలో నిరంతర కోతలు తప్ప విద్యుత్ ఉండేది కాదు. ఇప్పుడు ఎక్కడా కోతలు అన్న పదానికి తావు లేకుండా చేసిన ఘనత సిఎం కెసిఆర్‌దే. ఇది ఎవరూ కాదనలేని నిజం. మనకు అనుభవంలో ఉన్న సత్యం. పారిశ్రామిక వేత్తలు కూడా దీనిని అంగీకరిస్తున్నారు. ఇక మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాల అధ్యయనం కోసం ఇక్కడికి వివిధ రాష్ట్రాల అధికారులు వస్తున్నారంటే అవి ఎంతగా ప్రాచుర్యం పొందాయో చెప్పకరలేదు.



# విద్యుత్ సమస్యకు చెక్ పెట్టిన తొలి సిఎం

## నిరంతర విద్యుత్‌తో సమస్యలు దూరం
## మారుతున్న వ్యవసాయ ముఖచిత్రం
## తెలంగాణలో పెరిగిన పంటదిగుబడులు

**హైదరాబాద్,జూన్1(విజయవమ్ న్యూస్)**



నిరంతర విద్యుత్..కల కాదని తెలంగాణలో సిఎం కెసిఆర్ నిరూపించారు. కరెంట్ పోతే వార్త అన్న వాదన పైకి తీసుకుని వచ్చారు. టైమ్ చూసుకుని వంటింట్లోకి వెళ్లే ఆగత్యం లేకుండా చేశారు. అలాగే కరెంట్ లేక జిరాక్స్ సెంటర్లు మూతపడ్డ ఘటనలు మాయమయ్యాయి. లాంతర్లు పట్టి నిరసనలు తెలిపే రోజులు పోయాయి. ఇందిరాపార్క్ వద్ద పారిశ్రామిక వేత్తల నిరసనలు లేవు. ఇలా చెప్పుకుంటూ పోతే కరెంట్ కథలు ఎన్నో ఉన్నాయి. తెలంగాణలో రైతే రాజు కావాలి.. తెలంగాణ రైతు రాజ్యం కావాలి! వ్యవసాయం చేయడం ఉత్సవంలా సాగాలి! రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రం సమగ్రంగా మారిపోవాలి.. అంతిమంగా బంగారు తెలంగాణ నిర్మాణం కావాలి! ఇది ఒక రాజకీయ పార్టీ సంకల్పంగా మాత్రమే చూడరాదు. దార్శనికుడైన నేత నాయకత్వంలో తీసుకున్న ప్రభుత్వ ఆలోచనగా చూడాలి. తన తపనంతా రాష్ట్రాభివృద్ధి కోసమేనని చాటిన సిఎం కెసిఆర్ రైతుల రక్షణ తన లక్ష్యమని ప్రకటించారు. కాలుష్యకారక పరిశ్రమలకు ఇచ్చే ప్రోత్సాహంలో కనీసం పైసావంతు రైతుకోసం ఖర్చు పెడితే పక్కాగా, ప్రణాళికా బద్దంగా ముందుకు సాగితే దేశం బలడడమే గాకుండా ప్రపంచానికే పట్టెడన్నం పెట్టగలదు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత కోటి ఎకరాల మాగాణంగా మార్చాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి కెసిఆర్ మదిలో రైతులకు సంబంధించిన పటిష్టమైన ఆలోచనలు రావడం స్వాగతించాలి. విద్యుత్ సమస్యను అధిగమించిన తెలంగాణలో రైతులకు పెట్టుబడి అందిస్తామని చెప్పిన సిఎం కెసిఆర్ దానిని అమలు చేశారు. నిజంగానా రైతు కుటుంబాల్లో ఆశలు నింపింది. వట్టిపోయిన తెలంగాణలో వ్యవసాయాన్ని లాభదాయకం చేయడం అంత ఆషామాషీ కాదు. నదులు జీవం కోల్పోయాయి. చెరువులు ఆనవాళ్లు లేకుండా చేశారు. విద్యుత్ అందకుండా చేశారు. ఈ దశలో తెలంగాణ ఏర్పడ్డ తొమ్మిదేళ్లలో అద్భుతాలు రావాలని కోరుకోవడం అత్యాశే అవుతుంది. అయినా అడుగులు పడ్డాయి. రైతులకు కరెంట్ అందుతోంది. చెరువుల పూడికతీత ముమ్మరంగా సాగుతోంది. దీంతో చెరువుల్లో నీరుచేరి ఊళ్ళు కళకళలాడుతున్నాయి. ఇక ప్రాజెక్టుల పనులు శరవేగంగా సాగుతున్నాయి. అయినా వీటితోనే రైతులు బాగు పడ్డాయని ఎవరూ అనడం లేదు. అలాగే పాలకుడైన సిఎం కెసిఆర్ కూడా అనడం లేదు. నిజాయితీగానే వ్యవసాయాన్ని పండగ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామనే చెబుతున్నారు. రైతును నష్టాల ఊబిలోంచి లాగడమంటే రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడం అన్నది కెసిఆర్‌కు తెలియంది కాదు. నిజంగా కెసిఆర్ ప్రకటించిన విధానాలు వ్యవసాయాన్ని బలోపేతం చేస్తాయనడంలో సందేహం లేదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా చేసిన ఆలోచనగా భావించాలి. కల్తీ విత్తనాలు అమ్మేవారిపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించారు. రైతులకు జరిగిన నష్టాన్ని కంపెనీలే చెల్లించేలా చట్టం తెస్తామన్నారు. ఇంతకంటే రైతు మరేం కోరుకుంటాడు. పాలకులు ఏదైనా పథక రచన చేస్తే దానిని అమలు చేయించుకునే బాధ్యత విపక్షాలపైనా ఉంటుంది. విమర్శలకే ప్రతిపక్షాలు పరిమితం కారాదు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. రైతుల్ని సంఘటితం చేసి, అవసరమైన పంటలను పండించే క్రమంలో కూడా ఆలోచనలుచేస్తున్నారు. తెలంగాణను పంటల కాలనీలుగా విభజించి,ఇకపై ఏ జిల్లాలో ఏ పంటలు వేయాలో నిర్ణయిస్తామన్న ప్రకటనవల్ల అందరూ ఒకే రకమైన పంటలు వేసి నష్టపోకుండా చూడడం జరుగుతుంది.

# అయోధ్యలో చురుకుగా రామలయ నిర్మాణం

## గర్భగుడి పనులకు సిఎం యోగి శంకుస్థాపన

## 2023 డిసెంబర్‌లోగా ఆలయ గర్భగుడి పనులు పూర్తి

**లక్నో,జూన్1(విజయవమ్ న్యూస్):**

అయోధ్య రామాలయం పనులు శరవేగంగా సాగుతున్నాయి. డిసెంబర్ కల్లా ఈ పనులు పూర్తవుతాయని కమిటీ అంచనా వేస్తోంది. శిలాపూజ కార్యక్రమం అనంతరం గర్భగుడి పనులు ప్రారంభమయ్యాయి. 2023 డిసెంబర్‌లోగా ఆలయ గర్భగుడి పనులు పూర్తవుతాయని రామాలయ పనులు చూసుకుంటున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆశాభావం వ్యక్తం చేసింది.2024లోగా ఆలయ నిర్మాణం, 2025లోగా ఆలయ సముదాయంలోని ఇతర నిర్మాణాలు పూర్తవుతాయని రామమందిరం నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా చెప్పారు. 2.7 ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన ఆలయాన్ని నిర్మిస్తున్నారు. మందిరం పొడవు 360 అడుగులు, వెడల్పు 235 అడుగులు ఉండనుంది. మూడు అంతస్తులతో నిర్మించనున్న ఈ మందిరం ఎత్తు 161 అడుగులు ఉంటుంది. రెండున్నర అడుగుల పొడవు ఉన్న 17 వేల రాళ్లను మందిరం నిర్మాణంలో ఉపయోగిస్తున్నారు. అయోధ్యలో రామాలయం నిర్మాణానికి మార్గం సుగమం చేస్తూ 2019లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. 2020 ఆగస్టు 5న అయోధ్య రామ మందిర నిర్మాణం లాంఛనంగా ప్రారంభమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. వేద మంత్రాల మధ్య ఆలయానికి పునాది రాయి వేశారు. అప్పటి నుంచి నిర్మాణ పనులు చకచకా జరిగిపోతున్నాయి. వచ్చే ఎన్నికల్లోగా దీనిని పూర్తి చేయాలన్న సంకల్పం కనిపిస్తోంది.

# తహసీల్దార్, పోలీస్ స్టేషన్ పనులు పూర్తి చేయండి

## కార్యాలయాలను పరిశీలించిన కలెక్టర్, సీపీ

**ఖమ్మం జూన్,01(విజయమ్ న్యూస్):**

పనుల్లో వేగం పెంచి త్వరిత గతిన పనులన్నీ పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ ఇంజనీరింగ్ అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. గురువారం పోలీసు కమీషనర్ విష్ణు.యస్. వారియర్‌తో కలిసి రఘునాథపాలెం మండలంలో తహశీల్దారు, పోలీసు స్టేషన్ పనులను పురోగతిని పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 10 వ తేదీన తహశీల్దారు, పోలీసు స్టేషన్ భవనాలను ప్రారంభించనున్నట్లు ఆయన అన్నారు. శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, పంచాయితీరాజ్ ఇ.ఇ కె.వి.కె శ్రీనివాస్, రఘునాథపాలెం తహశీల్దారు నర్సింహారావు, మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ కలెక్టర్ వెంట ఉన్నారు.